సాక్షి చెన్నై | బుధవారం | నవంబర్ | 21 | 2018



# శ్రీరామచంద్ర ఆస్పత్రిలో స్పైన్ సర్జరీ సెంటర్

టీ.నగర్: శ్రీ రామచంద్ర ఆస్పత్రిలో మంగళ వారం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎండోస్కోపిక్, మినిమల్లీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీ (సీఈఈఎంఐ ఎస్ఎస్) ప్రారంభించబడింది. దీనిని అమెరికా అట్లాంటాలోగల వెల్‌స్టార్ కెన్నిస్టోన్ హాస్పిటల్, స్పైన్ సర్జరీ, కో–చైర్మన్ డాక్టర్ తపన్ దఫ్తారీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటయిన కార్యక్రమంలో ఆయనతోపాటు శ్రీరామచంద్ర వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పీవీ.విజయరాఘవన్, సెంటర్ హెడ్ డాక్టర్ కార్తిక్ కైలాష్ పాల్గొన్నారు. ఇందులో తపన్ దఫ్తారీ మాట్లాడుతూ మినిమల్లీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీ ద్వారా వ్యక్తి నరాలకు, కండరాలకు ఎటువంటి హాని లేకుండా చికిత్స చేయడం సాధ్యమౌతున్నందున ప్రపంచ వ్యాప్తంగా ఈ శస్త్రచికిత్సకు ఆదరణ పెరిగిందన్నారు. ఇందుకు నైపుణ్యాలతో కూడిన శిక్షణ, సూక్ష్మ పరికరాలు అవసరమన్నారు. డాక్టర్ పీవీ విజయరాఘవన్ మాట్లాడుతూ ఓపెన్ సర్జరీతో నరాలు, కండరాలకు హాని కలిగే అవకాశం ఉన్నందున తమ ఆస్పత్రి వైద్యులకు ఉన్నత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ కార్తిక్ కైలాష్ మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో ఏటా సుమారు 750 ఓపెన్ స్పైన్ సర్జరీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.




ప్రసంగిస్తున్న డాక్టర్ తపన్ దఫ్తారీ

## రూ.10 లక్షల నగల చోరీ

టీ.నగర్: రూ.10 లక్షలు విలువ చేసే బంగారు నగలను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం చోరీ చేశారు. చెన్నై షావుకారుపేట హనుమంతరాయన్ ఆలయం వీధిలో షరీఫుల్ హక్ నగల వర్క్‌షాపు నడుపుతున్నాడు. తన వద్ద పనిచేసే షకీల్ (18) అనే యువకుడికి సోమవారం 416 గ్రాముల బంగారు నగలను పాలిష్ చేయమని ఇచ్చి పంపాడు. వాటితో బయలు దేరిన షకీల్ వాల్‌టాక్స్‌రోడ్డు, ఆంధ్రభవన్ హోటల్ వద్ద ఇద్దరు వ్యక్తులు తనను మోసగించి నగలను అపహరించినట్లు యజమానికి తెలిపాడు. దీంతో షరీఫుల్ హక్ ఎలిఫెంట్ గేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన నగల విలువ రూ.10 లక్షలుగా ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీటీవీ కెమెరా పుటేజీల ద్వారా షకీల్‌ను విచారిస్తున్నారు.